క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక పట్టణంలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రధానార్చకులు అరవెల్లి రవిశర్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, అందరూ బాగుండాలని కోరుకున్నారు.

సెట్విజ్ సీఈఓ సందర్శన


వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులతో మాట్లాడుతున్న సెట్విజ్ సీఈఓ శ్రీనివాస్

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సెట్విజ్ సీఈఓ శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఖోఖో క్రీడలో శిక్షణ పొందేందుకు మొత్తం 35 మంది హాజరవుతున్నారని, వీరిలో 25 మంది బాలురు, 10 మంది బాలికలు ఉన్నారని పీడీ సత్యనారాయణ తెలిపారు. అనంతరం విద్యార్థులను పరిచయం చేసుకున్న సీఈఓ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, మంచి క్రీడాకారులుగా రాణించాలని కోరారు.

కొత్తవలసలో వాలీబాల్ కోచింగ్


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


కొత్తవలస: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో వాలీబాల్ కోచింగ్ ఇస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిబాబు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, కొత్తవలస వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే కోచింగ్ ప్రారంభమైందని, 12 నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలంతా కోచింగ్‌కు తరలిరావాలన్నారు.

పుస్తకాల వితరణ


గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సోమేశ్వరరావు

లక్కవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయానికి శ్రీరాంపురం గ్రామానికి చెందిన శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ రూ.15 వేల విలువైన పుస్తకాలను ఆదివారం వితరణ చేసింది. వీటిని లైబ్రేరియన్ శ్రీధర్‌కు ట్రస్ట్ ప్రతినిధి వేదుల సోమేశ్వరరావు అందజేశారు. ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, దీనికి తమవంతు సాయం అందించడం చాలా ఆనందంగా ఉందని దాత అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను సర్పంచ్ బానాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ రామరత్నం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఇదే స్ఫూర్తితో ఇంటర్మీడియట్, డిగ్రీలో బాగా రాణించి, భవిష్యత్‌లో ఉన్నత స్థానం చేరుకోవాలని సర్పంచ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బిల్లలవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' వెలుగులు


ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీరనారాయణం గ్రామంలో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపకూ లబ్ధి జరుగుతోందన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా ప్రజలు కష్టాలు పడకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ ఎం.సరోజిని, ఎంపీటీసీ సభ్యురాలు బి.వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.సోంబాబు, బి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న దివ్యాంగుల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.పైడిపునాయుడు

గజపతినగరం: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని దివ్యాంగుల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.పైడిపునాయుడు అన్నారు. మండలంలోని మరుపల్లి గ్రామంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సభ్యుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన దివ్యాంగుల సమావేశానికి హాజరైన ఆయన దివ్యాంగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు, స్కూటీలు, ఇతర పరికరాలతో పాటు పెన్షన్‌ను రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచాలని దివ్యాంగులు కోరారు. ఈ మేరకు ఆయన ఆయా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ రెడ్డి పద్మావతి, సోషల్ సర్వీస్ న్యాయవాది పాట్నూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం


శృంగవరపుకోట: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

- అల్లూరి సీతారామరాజు వర్ధంతిలో వక్తలు


కొత్తవలస: అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవా సమితి సభ్యులు

కొత్తవలస: దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటిషర్లకు వ్యతిరేకంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలోని సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ భారతీయులను బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగించేందుకు అల్లూరి అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానుభావుల్లో ఆయన అగ్రగణ్యుడన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు గోపిరాజు, కార్యదర్శి పాకలపాటి శ్రీనివాసవర్మ, బంగార్రాజు, వెంకటపతిరాజు, శ్రీనురాజు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక పట్టణంలోని ఎమ్మెల్సీ రఘురాజు స్వగృహంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రానికి తన ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన ధీశాలి అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, ఎంపీటీసీ ఎం.దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి ఆలయ ప్రారంభోత్సవం


సత్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం ప్రధాన రహదారిలో నిర్మించిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయాన్ని ఆదివారం వైభవంగా ప్రారంభించారు. వేకువజామున ప్రాతరౌపాసన, మండప పునః ప్రతిష్ఠ, గర్తన్యాసం, ధాతున్యాసం, బీజన్యాసం, రత్నన్యాసం, తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేపట్టి ప్రాణ ప్రతిష్ఠ జరిపించారు. ప్రత్యేక హోమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శన భాగ్యం కల్పించారు. స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, రైల్వే సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్ల వెంకటరమణ, సర్పంచ్ అట్టాడ శ్రీను, తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్, ఆధ్యాత్మిక సలహాదారుడు శ్రీధర్, విద్యోపాసకులు కోదండ రామశర్మ పాల్గొన్నారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ చక్రవర్తి

చీపురుపల్లి: డీఎస్పీగా ఏఎస్ చక్రవర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో రాజాం అర్బన్ సీఐ రవికుమార్‌తో పాటు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎస్ఐలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది చూడాలని, అలాగే ప్రజలు కూడా శాంతియుత వాతావరణంలో జీవనం సాగించేందుకు మక్కువ చూపాలని కోరారు.

ధర్మప్రచార రథానికి ఆర్థికసాయం

గజపతినగరం: ధర్మప్రచార రథం కొనుగోలుకు ఎస్టీజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకల చంద్రరావు రూ.10 వేల ఆర్థికసాయం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ధర్మప్రచార ప్రతినిధులు పి.ఎ స్.ఎస్.వర్మరాజు బృందానికి ఆదివారం నగదు అందజేశారు.

నేటి నుంచి ప్రత్యేక తరగతులు

వేపాడ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో ఉపాధ్యాయులు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ తరగతులకు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే వారంతా రావాలని కోరారు.

13 వరకు రీకౌంటింగ్‌కు అవకాశం

లక్కవరపుకోట: పదో తరగతి మార్కుల్లో ఏవైనా తేడాలుంటే ఈ నెల 13వ తేదీలోగా రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఎంఈఓ కూర్మారావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఏ సబ్జెక్ట్ మార్కులను అయితే రీకౌంట్ చేయాలనుకుంటున్నారో దాని కోసం రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనికోసం వెబ్‌సైట్ www.cfmr.ap.gov.inను సంప్రదించాలన్నారు. జవాబు పత్రాలు కూడా కావాలంటే రూ.వెయ్యి చలానా తీసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి సానుకూలం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట దళితవాడలో తిష్ట వేసిన సమస్యల పరిష్కారానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారని టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల జెడ్పీ కార్యాలయంలో జరిగిన సమీక్షలో సీతారామునిపేట దళితవాడలో మురుగు కాలువలు, స్టేజి మరమ్మతుల సమస్యలపై ప్రస్తావించామని, స్పందించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అంచనాలు సిద్ధం చేయమని ఆదేశించారన్నారు. సంబంధిత సచివాలయ సిబ్బంది అంచనాలు రూపొందించారని త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం


మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి

శృంగవరపుకోట: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ డి.సంతోషికుమారి అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని ఎమ్మెల్సీ రఘురాజు నివాసంలో మీడియాతో మాట్లాడిన వారు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఇదే సంతోషం కొనసాగాలన్నా, రెట్టింపు కావాలన్నా, 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీయే అధికారంలోకి రావాలని, ఆ దిశగా మనమంతా కలిసి పని చేయాలని కోరారు. ఎమ్మెల్యే సీటు ఎవరికిచ్చినా వారి గెలుపు కోసం పాటుపడతామన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి తోడ్పడాలి


ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోటలక్ష్మి

గంట్యాడ: మార్కెట్ కమిటీ అభివృద్ధికి తోడ్పడాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. విజయనగరంలోని ఆయన నివాసంలో గజపతినగరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన గంట్యాడ మండలం, పెదమదుపాడకు చెందిన గనివాడ కోటలక్ష్మి ఎమ్మెల్యేను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపిక చేసినందుకుగాను ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మదుపాడ సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు పొటువురెడ్డి వెంకటరావు, ద్వారపురెడ్డి త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారంతా ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75, బీసీ, ఓసీలకు రూ.150 రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుందన్నారు. జూన్ 11వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

బొండపల్లి: గజపతినగరం మండలంలోని మరుపల్లి గ్రామ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.ఈశ్వరరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వేపాడ: స్థానిక ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మే 9 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్/ఏపీఎంఎస్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 11వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

కొత్తవలస/లక్కవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్లు రామలక్ష్మి, శ్రీధర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణా శిబిరంలో 10 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులతో కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడంతో పాటు వక్తృత్వం, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్ తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నామని లైబ్రేరియన్ రామారావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

గజపతినగరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ వై.స్వప్న ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ శిబిరంలో కథలు చదవడం, చెప్పించడం, వినడం, వక్తృత్వం, చిత్రలేఖనం, పుస్తక పఠనం, సమీక్ష, పేపర్ ఆర్ట్ వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

వేపాడ: స్థానిక శాఖా గ్రంథాయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ సోమునాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ శిబిరంలో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదో తరగతి ఫలితాల్లో.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

మెరకముడిదాం: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ మార్కులతో కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా నిలబడ్డారు. మండలంలోని గర్భాం ఏపీ మోడల్ స్కూల్ 98 శాతం ఉత్తీర్ణతతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన సాయిస్ఫూర్తి 583 మార్కులు సాధించి, సత్తా చాటాడు. భైరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తాడేల గణేష్ 580 మార్కులు సాధించి, మండలంలో ద్వితీయ స్థానంలో నిలబడ్డాడు. ఈ పాఠశాల నుంచి మొత్తం 92 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 73 మంది పరీక్ష పాస్ అయినట్లు సిబ్బంది తెలిపారు.

అలాగే బిల్లలవలస జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 76 మంది విద్యార్థులకు గాను 58 మంది, మెరకముడిదాం కేజీబీవీ నుంచి 45 మంది విద్యార్థులకు 22 మంది, ఉత్తరావల్లి పాఠశాల నుంచి 89 మంది విద్యార్థులకు 50 మంది, మెరకముడిదాం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 71 మంది విద్యార్థులకు గాను 42 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే గర్భాం పాఠశాల నుంచి 104 మంది విద్యార్థులకు 79 మంది, గరుగుబిల్లి పాఠశాల నుంచి 27 మందికి 17 మంది, సాతాంవలస పాఠశాల నుంచి 27 మందికి 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

నేడు ఆర్‌బీకే ప్రారంభం

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే)ను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చేతులమీదుగా సోమవారం ప్రారంభించనున్నారని ఎంపీపీ చల్లా చలంనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మహిళా పార్క్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయండి

- మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


మహిళా పార్క్‌ను పరిశీలిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేటర్లు

విజయనగరం: నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన మహిళా పార్క్ ప్రారంభోత్సవానికి మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్క్‌ను మహిళా కార్పొరేటర్లతో కలిసి ఆదివారం పర్యటించారు. స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, పిల్లల క్రీడాసామగ్రిని పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా మహిళలకు ఇస్తున్న గౌరవం మరువలేనిదన్నారు. అదేరీతిలో స్థానిక శాసనసభ్యుడు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మరో అడుగు ముందుకు వేసి మహిళల కోసం ప్రత్యేకంగా పార్క్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆనందగజపతి ఆడిటోరియం నుంచి 5 వేలకు పైగా మహిళలతో ర్యాలీ చేపట్టి ప్రారంభోత్సవ ప్రాంతానికి చేరుకోనున్నట్లు చెప్పారు. మహిళలందరూ ఆనందగజపతి ఆడిటోరియం వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ నుంచి మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆర్‌కే రోజా, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులతో కలిసి పార్క్ వరకు ర్యాలీగా చేరుకుంటామని చెప్పారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్క్‌ను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, మహిళా కార్పొరేటర్లు, పైడితల్లమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు, వివిధ డివిజన్ల మహిళా అధ్యక్షులు పాల్గొన్నారు.